ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
1
RNI No: APTEL/2023/87888
బుధవారం
17 సెప్టెంబర్ 2025

ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనది:సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పబ్లిక్ గార్డెన్లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు.

"ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటం మనది. సాయుధ పోరాటస్ఫూర్తితో నిన్నటి నియంత పాలనను పక్కనపెట్టాం. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావులేదు. స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్మోడల్గా ఉన్నాం. ఉన్నత చదువుల ద్వారా మన యువత సత్తా చాటాలి. భవిష్యత్తులో పాఠశాలల రూపురేఖలు మారబోతున్నాయి. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలో రాష్ట్ర విద్యా విధానం తెస్తున్నాం. సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి సత్తాచాటారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు ఏర్పాటు చేస్తాం. రైతుల కోసం తెచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఏ రాష్ట్రం చేయని విధంగా వారికి మేలు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించాం. సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం.

కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు

గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. మా ప్రభుత్వం వచ్చాక భూభారతి చట్టం తెచ్చి సమర్థంగా అమలు చేస్తున్నాం. పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం. 904 టీఎంసీల సాధనకు ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపిస్తాం. కృష్ణా జలాల హక్కుల కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. ఎస్ఎల్బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేసేది లేదు.

హైదరాబాద్ నగరాన్ని గేట్వే ఆఫ్ వరల్డ్ తీర్చిదిద్దుతాం

హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. ఈ నగరాన్ని గేట్వే ఆఫ్ వరల్డ్ తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మన రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి. హైదరాబాద్కు గోదావరి జలాలు తీసుకొస్తున్నాం. కాలుష్యం లేని నగరంగా మారుస్తున్నాం. మూసీ నది పక్కన జీవించే పేదలకు మంచి జీవన ప్రమాణాలు కల్పిస్తాం. ఈ పరిధిలో ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తాం. ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా అనేక అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

త్వరలోనే మెట్రో విస్తరణ పనులు

త్వరలోనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తాం. తెలంగాణ అంటేనే పోరాటాలు, త్యాగాలకు వేదిక. యువత పాలిట శాపంగా మారిన డ్రగ్స్ సమస్యను అరికడతాం. మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి. వీటిని అరికట్టడంలో మన పోలీసులు సత్తా చాటారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ 9న రాష్ట్ర ప్రజలకు దీన్ని అందిస్తాం. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే ఉద్దేశంతో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం. దీంతో రాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

సరైన సమయంలో సరైన నాయకుడు.. మోదీకి చంద్రబాబు బర్త్ డే విషెస్

అమరావతి, సెప్టెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సరైన సమయంలో సరైన నాయకుడు దొరకడం మన అదృష్టమన్నారు.

నిబద్ధత, దృఢ సంకల్పంతో దేశాన్ని ఆయన నడిపిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఆయన చేపట్టిన సాహసోపేతమైన సంస్కరణ అని పేర్కొన్నారు. ప్రజలు, దేశ శ్రేయస్సు పట్ల మోదీకి ఉన్న నిబద్ధత ఎంతోమంది జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. ఆరోగ్యం, అపరిమిత శక్తితో దేశానికి మరింత సేవ చేయాలని కోరుకుంటున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

కాకినాడ జిల్లాలో బావిలో రెండు మృతదేహాలు లభ్యం

పిఠాపురం, సెప్టెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): కాకినాడ జిల్లాలో బావిలో రెండు మృతదేహాలు లభ్యం కావడం కలకలం రేపింది. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో బావిలో మృతదేహాలను స్థానికులు గుర్తించారు. మృతులను అదే గ్రామానికి చెందిన తోలాటి సూరిబాబు, రంపం శ్రీనుగా నిర్ధరించారు. ఎవరైనా హత్య చేసి బావిలో పడేశారా? ఆత్మహత్యా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

మధ్యతరగతికి ఉపశమనం కల్పించేలా జీఎస్టీ సంస్కరణలు:నిర్మలా సీతారామన్

విశాఖపట్నం, సెప్టెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్): దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే జీఎస్టీ పై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. "ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్ల నుంచి రెండు శ్లాబ్లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్కిన్లు పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరింది." అని నిర్మలా సీతారామన్ వివరించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'దయచేసి నువ్వు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయొద్దు..' :మహేశ్ బాబు ఆసక్తికర పోస్ట్

చిన్న సినిమాగా విడుదలై సూపర్ హిట్ విజయాన్ని అందుకుంది లిటిల్ హార్ట్స్. ఇప్పటికే ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తూ సినీ ప్రముఖులు పోస్టు పెట్టారు. తాజాగా టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఈ నవ్వుల రైడ్కు ఫిదా అయ్యారు. చిత్రబృందాన్ని అభినందిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. సంగీత దర్శకుడు సింజిత ను ఉద్దేశిస్తూ ఫన్నీ కామెంట్ చేశారు."లిటిల్ హార్ట్స్.. ఆద్యంతం సరదాగా సాగే వినోదభరితమైన సినిమా. నటీనటులందరూ కొత్తవారే అయినా చాలా బాగా నటించారు. అద్భుతమైన నవ్వుల రైడ్ ఈ చిత్రం. సింజిత్ నువ్వు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎక్కడికీ వెళ్లొద్దు బ్రదర్.. ఎందుకంటే నువ్వు కొన్నిరోజుల్లో చాలా బిజీగా మారిపోతావ్.." అని అన్నారు. దీంతో పాటు చిత్రబృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుతం మహేశ్ పోస్ట్ వైరల్ అవుతోంది. మహేశ్ ప్రత్యేకించి సంగీత దర్శకుడిని అలా అనడానికి కారణముంది. ఇటీవల సింజిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను మహేశకు వీరాభిమానినని చెప్పారు. మహేశ్ 'లిటిల్ హార్ట్స్' గురించి పోస్ట్ పెడితే తన ఆనందానికి హద్దులు ఉండవన్నారు. ఆ ఆనందంలో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని వారం రోజులు ఎటైనా వెళ్లిపోతానన్నారు. అందుకే మహేశ్ తన పోస్టో ప్రత్యేకంగా సింజిత్ను ఉద్దేశించి మాట్లాడినట్లు తెలుస్తోంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్

అవి ఎప్పుడూ వేర్వేరు కాదు :షాహిద్ అఫ్రిదికి గావస్కర్ కౌంటర్

భారత్- పాకిస్థాన్ జట్ల మధ్య కరచాలనం వివాదం కొనసాగుతూనే ఉంది. టీమ్ ఇండియాపై పాక్ మాజీలు అవాకులు చెవాకులు పేలుతూనే ఉన్నారు. తాజాగా షాహిద్ అఫ్రిది కూడా మరోసారి 'రాజకీయాలు - క్రీడలు' అంశాలను వేర్వేరుగా చూడాలంటూ పేర్కొన్నాడు. దానికి క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఘాటుగా స్పందించాడు. పాక్ మాజీ సారథికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. ఆ రెండూ ఎప్పుడూ వేర్వేరు కాదని స్పష్టం చేశాడు. "గత కొన్నేళ్లుగా చూస్తే మీకే అర్థం అవుతుంది. క్రీడలు, రాజకీయాలు వేర్వేరు కాదు. ఇక్కడ నేను ఎవరినీ విమర్శించను. వారు తీసుకొనే స్టాండ్ అలా ఉంటే ఏం చేయలేం. మీరు (విమర్శకులను ఉద్దేశించి) రాజకీయాల గురించి చర్చించినప్పుడు.. ఇవన్నీ అందులోకి వస్తాయి. భారత్ చేతిలో ఓటమి తర్వాత పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా ప్రెస్ కాన్ఫరెన్స్కు రాలేదు. అయితే, అదేమీ పెద్ద వ్యత్యాసం చూపించదు. విజయం సాధించిన జట్టు సారథి ఏం చెబుతాడన్నదే ప్రజలు ఆసక్తిగా వింటారు. అవతలి జట్టు గురించి పట్టించుకోరు" అని గావస్కర్ తెలిపాడు. ఇప్పటికే రాహుల్ గాంధీపై షాహిద్ అఫ్రిది ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. ఆ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించిన గావస్కర్ కౌంటర్ ఇచ్చాడు.

అంతకుముందు షాహిద్ ఏమన్నాడంటే..?

ఆసియా కప్ గ్రూప్ స్టేజ్లో భారత్ చేతిలో పాక్ ఓడింది. ఆ తర్వాత ప్రత్యర్థి ప్లేయర్లతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయలేదు. దీనిపై ఓ టీవీ చర్చా కార్యక్రమంలో షాహిద్ మాట్లాడుతూ.. "ఆసియా కప్ ప్రారంభం ముందు నుంచీ సోషల్ మీడియాలో బాయ్కాట్ ప్రచారం జరిగింది. కాబట్టి, నెట్టింట విపరీతమైన ఒత్తిడి వచ్చింది. దాంతో భారత్ ఆటగాళ్లు మాతో కరచాలనం చేయలేదు. ఇందులో ఎలాంటి ఆశ్చర్యం లేదు. కానీ, నా అభిప్రాయం ప్రకారం క్రీడా స్ఫూర్తి కాదు. టోర్నీ ముందు ప్రెస్ కాన్ఫరెన్స్లో అందరూ షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు" అని షాహిద్ అఫ్రిది తెలిపాడు.

అందం

జుట్టుకి హెన్నా పెట్టేటప్పుడు 90 శాతం మంది చేసే తప్పులు, వీటి వల్లే జుట్టు రాలుతుంది

జుట్టు కండీషనింగ్ కోసం హెన్నా పెడతారు. దీనిని వాడడం వల్ల జుట్టు షైనీగా, అందంగా, మెరుస్తూ పెరుగుతుంది. అందుకే, రెగ్యులర్గా హెన్నా వాడుతుంటారు. అయితే, హెన్నా వాడేటప్పుడు కొన్ని తప్పులు చేయకూడదు. అవేంటో తెలుసుకోండి.

హెన్నా.. అనేది సహజంగా దొరికే గోరింటాకు మొక్క ఆకుల్ని ఎండబెట్టి పొడిలా చేసి హెన్నాలా వాడతారు. దీనిని వాడడం వల్ల జుట్టు మంచి రంగులోకి వస్తుంది. బర్గండీ, రెడ్ కలర్లోకి మారుతుంది. అంతేకాదు, దీని వల్ల జుట్టుకి కూడా చాలా మంచిది. తెల్లజుట్టు సమస్యతో బాధపడేవారు హెన్నాని కెమికల్ డై బదులు వాడతారు. ఇవి సహజంగా దొరుకుతాయి. ఎలాంటి కెమికల్స్ ఉండవు. కాబట్టి, జుట్టుకి కూడా ఎలాంటి సమస్యలు రావు. అయితే, దీనిని సరైన విధంగానే వాడాలి. లేదంటే చాలా సమస్యలొస్తాయి. మార్కెట్లో లభించే చాలా హెన్నాలలో రకరకాల కెమికల్స్ ఉంటున్నాయి. వీటి వల్ల జుట్టుకి సమస్యలొస్తాయి. మరి మనం చేయకూడని తప్పులేంటో తెలుసుకోండి.

ఏ కలర్

చాలా మంది కూడా నేడు మార్కెట్లో దొరికే రకరకాల రంగుల హెన్నాలు వాడుతుంటారు. కానీ, ఎప్పుడూ అలా చేయొద్దు. నేచురల్ హెన్నా ఆరెంజ్ రెడీష్ రంగులో ఉంటుంది. దీనినే వాడాలి. అదే విధంగా, ఎప్పుడు కొన్నా కూడా బాక్స్పై ఉన్న పదార్థాలను చదవండి. 100 శాతం నేచురల్ హెన్నానే వాడాలి.

ఇండిగో, బ్లాక్ హెన్నా వేరు, హెన్నా వేరు

ఇండిగో, బ్లాక్ హెన్నాలు కూడా హెన్నా అనుకుంటారు. కానీ, కాదు. ఇండికి హెన్నాలా డై విడుదల కాదు. కాబట్టి, దీనిని కలిపిన 15 నుంచి 20 నిమిషాలలోపే వాడాలి. ఇండిగోలో ప్రమాదకరమైన పిపిడి లేదని నిర్ధారించుకోండి. ఇది జుట్టు, చర్మానికి అస్సలు మంచిది కాదు.

ఎంత వాడాలి



హెన్నా ఎంత వాడాలనేది పర్టిక్యులర్గా కొలతలేమీ లేవు. కానీ, మీ జుట్టు పొడవుని బట్టి, మీ జుట్టు ఎంత ఒత్తుగా ఉందనే విషయాన్ని బట్టి ఉంటుంది. మీకు ఎంత హెన్నా పౌడర్ అవసం-మో తెలుసుకుని దాని ప్రకారం మాత్రమే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకోవద్దు. తక్కువగా వాడొద్దు.

నిమ్మరసం



చాలా మంది నిమ్మరసాన్ని హెన్నాలో కలిపి వాడుతుంటారు. నిజానికీ, ఇది తప్పనిసరైతే ఏమీ కాదు. హెన్నాలో ఏదైనా లిక్విడ్స్ కలపాలి. నిమ్మరసంలో అసిడిక్ ఉంటుంది. ఇది జుట్టుని డ్రైగా చేస్తుంది. కాబట్టి, ఎక్కువ నిమ్మరసం కాకుండా తక్కువగా వాడండి. నిమ్మరసం బదులు బ్లాక్ టీ, కాఫీలను వాడొచ్చు. చమిమోలే టీ కూడా బెస్ట్ ఆప్షన్.

ఐరన్ బౌల్ వాడడం

స్వచ్ఛమైన హెన్నా పౌడర్ వాడినప్పుడు మీరు స్టెయిన్ లెస్ స్టీల్ గిన్నెలు వాడొచ్చు. కొంతమంది ఐరన్ బౌల్స్ వాడుతారు. దీని వల్ల డై వస్తుందని. ఎక్కువగా రంగు ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఇది కూడా అంత మంచిది కాదు. సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వాటి బదులు మీరు నార్మల్ స్టీల్ గిన్నెలు వాడొచ్చు.

ఎక్కువగా రాయడం

హెన్నా మంచిదని ఎక్కువగా అప్లై చేస్తే హెయిర్ అండ్ స్కాల్ప్ డ్రైగా మార-ుతుంది. కాబట్టి, దీని బదులు మీరు మాయిశ్చరైజర్ రాయాలి. దీనికోసం హెన్నాలో కొద్దిగా ఆయిల్, పెరుగు, కండీషనర్ వంటివి రాయొచ్చు. హెన్నా వాడాక కూడా కండీషనింగ్ చేయండి. మంచి రిజల్ట్ ఉంటాయి.

గమనిక

నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.